క్లుప్తంగా

సంతోషిమాత ఉత్సవ విగ్రహం ఊరేగింపు



తిరువీధులో సంతోషిమాత ఉత్సవ మూర్తి ఊరేగింపు

భామిని: సరిహద్దు మాతగా పూజలందుకొంటున్న బత్తిలి సంతోషిమాత ఉత్సవ విగ్రహాన్ని గురువారం తిరువీధి నిర్వహించారు. ఇటీవల తయారు చేయించిన మకర తోరణం అలంకరించి పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. శ్రావణ పౌర్ణమి రక్షాబంధన్ నాడు సంతోషిమాత జన్మదినంగా భావించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధ్యయనం



పూతికవలసలో పర్యటిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

సీతంపేట: గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఏ మేరకు గిరిజనులకు ఉపయోగపడుతున్నాయనేది ట్రైనీ ఐఏఎస్‌ల బృందం గురువారం అధ్యయనం చేసింది. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, చేదోడు వంటి పథకాలు తమకు వస్తున్నాయని గిరిజనులు తెలిపారు. ఆయా పథకాల ద్వారా మంచి జీవనం సాగిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా గ్రామం మొత్తాన్ని సందర్శించి సమస్యలు ఏమైనా ఉన్నాయా.. అని అడిగి తెలుసుకున్నారు.

సంతాపం

పాలకొండ: మండలంలోని గోపాలపురం గ్రామ సచివాలయం కన్వీనర్, సీహెచ్‌సీ గ్రూప్ కన్వీనర్ సవిరిగాన చంద్రశేఖర్ (42) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. వైఎస్సార్ సీపీకి గ్రామంలో కీలకంగా వ్యవహరించిన చంద్రశేఖర్ మరణించడంతో గ్రామంలో విషాదం అలముకుంది. రెండు రోజుల క్రితం చంద్రశేఖర్ గుండెపోటు రావడంతో రాజాం కేర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న సమయంలో మరో మారు గుండెపోటు వచ్చి మరణించినట్లు వైద్యులు గుర్తించారు. గురువారం ఉదయం గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లతో పాటు మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సంతాపం తెలిపారు. కాగా మృతుడికి భార్య సంధ్యారాణి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

కాంప్లెక్స్ సమావేశాల్లో గ్రూప్ చర్చలు జరగాలి



కాంప్లెక్స్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ ఆనందరావు

వీరఘట్టం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాఠశాలల బలోపేతానికి గ్రూప్ చర్చలు జరగాలని ఎంఈఓ ఆర్.ఆనందరావు సూచించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గురువారం జరిగిన ప్రాథమిక పాఠశాలల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన ఎఫ్ఏ–1 పరీక్షలపై విశ్లేషణ, అసెస్మెంట్, క్వశ్చన్ ఫార్మేట్స్, టీచ్ టూల్, ఎఫ్ఎల్ఎన్, సోషల్ ఆడిట్, లైబ్రరీ బుక్స్, శాలసిద్ధి తదితర విషయాలను చర్చించాలని సూచించారు. సమావేశంలో కాంప్లెక్స్ చైర్మన్ బి.సాంబర, సెక్రటరీ కె.విజయకుమార్, డీఆర్‌పీ మజ్జి పైడిరాజు, సీఆర్‌పీ కె.వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా లక్ష్యం

సీతానగరం: తప్పులు లేని ఓటరు జాబితా తయారీ లక్ష్యంగా ఓటరు నమోదు అధికారి పరిధిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో బూత్‌స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీఓ కె.హేమలత చెప్పారు. ఈ మేరకు గురువారం సీతానగరం మండలం గుచ్చిమిలోని 108, 109 పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గురువారం బూత్‌స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఓటరు తొలగింపు, ప్రక్రియ, వివరాలను తెలియజేయడం ద్వారా ఓటరు జాబితా మరింత పారదర్శకంగా ఉంటుందన్నారు. ప్రజాప్రతినిధుల సూచనలమేరకు బూత్‌స్థాయిలో సమావేలు నిర్వహించి తొలగింపు వివరాలు వెల్లడించాలని బీఎల్‌ఓలను ఆదేశించినట్లు చెప్పారు.

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి

బలిజిపేట: గ్రామాల్లో బీఎల్‌ఓలు సర్వే చేసి తొలగించిన ఓటర్ల జాబితాలో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నా వెంటనే తెలియజేయాలని తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్
- ఆర్‌బీఆర్ పేటలో పీఏసీఎస్ కేంద్రం ప్రారంభం



ఆర్‌బీఆర్‌పేటలో పీఏసీఎస్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్

పాలకొండ రూరల్: రైతు శ్రేయస్సు కోరి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. పాలకొండ ఆర్‌బీఆర్ పేటలో రూ.31లక్షలతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి కేంద్రాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌తో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ రైతు శ్రేయస్సే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. సీజన్‌తో సంబంధం లేకుండా అన్నదాతలకు ముందస్తు సహకారంతో అండగా నిలిస్తుందన్నారు. డీసీసీబీ సీఈఓ డి.వరప్రసాద్, డీసీఓ సన్యాసినాయుడు, డీఎం పి.బాజ్జి తదితరులు మాట్లాడుతూ సాధారణ రైతులతో పాటు కౌలు గుర్తింపు కార్డులు పొందిన రైతులకు రూ.వెయ్యి కోట్ల మేర రుణాలు అందించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ అన్నదాతలకు అన్నివిధాల తోడ్పాటు అందిస్తుందని, వీటిని రైతులు అందిపుచ్చుకోవాలని ఆర్‌బీఆర్‌పేట పీఏసీఎస్ అధ్యక్షుడు తాడేల జ్ఞానానందం, డైరెక్టర్ బంకి లక్ష్మణామూర్తి, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు రణస్థలం రాంబాబు తదితరులు అన్నారు. ఈ నూతన భవన నిర్మాణానికి నాబార్డు నుండి రూ.22లక్షలు, పీఏసీఎస్ నుంచి రూ.9లక్షలు ఖర్చు చేసినట్లు వీరు తెలిపారు. గ్రామ సర్పంచ్ బిడ్డిక నాగమ్మ అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మాళి భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్, వాకముడి అనిల్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు పాండ్రంకి హైమావతి, మజ్జి నవీన్‌కుమార్‌తో పాటు పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, రైతులు, పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన అవసరం



విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: రహదారి భద్రతపై విద్యార్థులంతా అవగాహన కలిగి ఉండాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అన్నారు. గుమ్మలక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆయన రోడ్ సేఫ్టీ ఆఫీసర్ నారాయణరావుతో కలిసి రహదారి భద్రతపై గురువారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలకు ఉండాల్సిన రికార్డులు గూర్చి, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ ధరించడం, వేగ పరిమితులను పాటించడం, వేగ నియంత్రణ ప్రదేశాల్లో వాహన వేగాన్ని నియంత్రిండం, అతి వేగం వల్ల కలిగే అనర్థాలు, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు మొబైల్ ఫోన్లు ఉపయోగించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్ఐ ఎస్.షన్ముఖరావు, ట్రాఫిక్ కానిస్టేబుల్ బి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బిడ్డిక భీముడు, ఉపాధ్యాయులు ఎం.సీతన్న తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్లు ఉండకూడదు..



మాట్లాడుతున్న డిప్యూటీ ఈఓ లిల్లీరాణి

సీతంపేట: గ్రామాల్లో డ్రాపౌట్లు ఉండకుండా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉంటుందని ఐటీడీఏ ఉప విద్యాశాఖాధికారి ఎ.లిల్లీరాణి అన్నారు. దోనుబాయి స్కూల్ కాంప్లెక్స్ సమావేశానికి గురువారం హాజరైన ఆయన మాట్లాడారు. విద్యార్థులకు ఆంగ్ల మీడియం పాఠాలు చక్కగా బోధించాలన్నారు. చిన్నారులకు వచ్చే ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందించాలన్నారు. చదువులో వెనుబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపన్యాసాలతో స్ఫూర్తి పొందాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపన్యాసకులు

పాలకొండ రూరల్: విద్యార్థులు అతిథి ఉపన్యాసాలు సద్వినియోగం చేసుకొని స్ఫూర్తి పొందాలని పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అన్నారు. తమ కళాశాల విద్యార్థుల కోసం హోమి బాబా నేషనల్ ఇనిస్టిట్యూట్ యూనివర్సిటీ ప్రొఫెసర్, ఐజీసీ ఏఆర్ శాస్త్రవేత డాక్టర్ సీహెచ్ జగదీశ్వరరావు అతిథి ఉపన్యాస కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపన్యాసకులు ఎలక్ట్రిసిటీ ప్రాముఖ్యత, సీఎఫ్సీ వాయువుల వలన, అధిక కార్బన్‌డైఆక్సైడ్ వలన కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసారు. కార్యక్రమంలో కెమిస్ట్రీ ఉపన్యాసకులు, పీజీ కోఆర్డినేటర్ ఎస్.రామకృష్ణ, భౌతిక, రసాయన శాస్త్ర విభాగాధిపతులు కె.శ్రీనివాసరావు, ఎం.శ్రీనివాసరావు తదితరులున్నారు.

రక్షిత పైపులైన్లు శుభ్రత



ప్రధాన పైపులైన్ నుండి విడిచి పెడుతున్న రంగు మారిన నీరు

పాలకొండ రూరల్: నగర పంచాయతీ పరిధిలో వెంకమ్మపేట రక్షిత పథకానికి నాగావళి నది నుండి నీటిని అందించే పైపులైన్లు మరమ్మతుకు గురవటంతో గత కొద్ది రోజులుగా కుళాయి నీరు రంగుమారి వస్తుంది. ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టినట్లు కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. గురువారం స్థానిక విలేకరుతో మాట్లాడారు. ఈ క్రమంలో పైపులైన్లలో నిల్వ ఉన్న రంగుమారిన నీటిని బయటకు విడిచిపెడుతున్నట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో సమస్యను అధిగమించేందుకు మరికొంత సమయం పడుతుందన్నారు. ప్రజలు సహకరించాలన్నారు. శుక్రవారం కూడా 1, 2, 12, 18 నుంచి 20 వార్డుల్లో రంగుమారిన నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రక్షిత ట్యాంక్ ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. త్వరలో రక్షిత కుళాయిల ద్వారా సురక్షిత నీటిని అందిస్తామన్నారు.

పెదపెంకిలో ఆదిభట్ల జయంతి



ఆదిభట్ల చిత్ర పటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో రెండవ నంబర్ పాఠశాలలో నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు ఆధ్వర్యంలో ఆదిభట్ల నారాయణదాసు జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పిన్నవయస్సులో కావ్యసంబంధిత పాఠాలను వల్లె వేయడం, హరికథాగానాన్ని ఆలపించి హరికథా పితామహుడిగా పేరుగాంచడం ఆయన గొప్పతనమని సంజీవనాయుడు కొనియాడారు. ఆయన చెప్పిన హరికథలు అంబరీషోపాఖ్యానం, జానకీ శపథం, యదార్థ రామాయణం, సావిత్రి చరిత్ర, సీతాకల్యాణం మంచి పేరుప్రతిష్ఠలు తీసుకువచ్చాయన్నారు. ఆయన గొప్పతనంతో తెలుగువాడికి ప్రపంచంలో కీర్తి లభించిందన్నారు. జిల్లాకు మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చిన మహనీయుడని గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.తిరుపతిరావు, జగదీశ్వరరావు, ఎం.రాంబాయమ్మ, జి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే చేపట్టాలి

పాలకొండ రూరల్: మండలంతో పాటు పట్టణ పరిధిలో సమగ్ర భూ సర్వే ప్రక్రియను సమర్థవంతగా పూర్తి చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు అన్నారు. తన కార్యాలయంలో వీఆర్వోలు, మండల సర్వేయర్, సచివాలయ సర్వేయర్లతో గురువారం సమావేశమయ్యారు. రీ సర్వే పూర్తి కావస్తున్న తరుణంలో లోపాలకు అటువంటి ఆస్కారం లేకుండా రికార్డులు నిర్వహణ ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సందేహాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో డిప్యుటీ తహసీల్దార్ బి.బుచ్చయ్య, రీసర్వే మొబైల్ డీటీ పి.సన్యాసిరావు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదు



సమావేశంలో పాల్గొన్న తహసీల్దార్, డీటీ

భామిని: మండలంలోని అన్ని రెవెన్యూ గ్రూప్‌ల పరిధిలో భూముల వివరాలను సర్వే చేసి జాబితాలు సిద్ధం చేయాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు, డీటీ రమేష్‌కుమార్ గురువారం సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన వీఆర్‌ఓల సమావేశంలో మాట్లాడారు. శాశ్వత భూసర్వే – శాశ్వత భూహక్కు కోసం భూమి వివరాల జాబితాలు సిద్ధంగా ఉండాలన్నారు. గ్రూపుల వారీగా సమీక్షించారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

పాలకొండ రూరల్: ఉద్యోగుల సమస్య పరిష్కారానికి ఏపీ ఎన్జీవో సంఘం నిరంతరం అంకితభావంతో కృషి చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అన్నారు. గురువారం పాలకొండ వచ్చిన ఆయన తమ సంఘ పాలకొండ డివిజన్ నూతన కోశాధికారి శ్రీనివాసరావును ఉపఖజానా కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక ఉద్యోగులతో సమావేశమయ్యారు. వారు అందించిన వినతులు స్వీకరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామన్నారు. ఆయన వెంట డివిజన్ గౌరవ అధ్యక్షుడు లిల్లీ పుష్పనాథం, భోగేశ్వరరావు తదితరులున్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



భక్తులతో లక్ష్మీ నృసింహస్వామికి అభిషేకాలు చేయిస్తున్న అర్చకుడు శ్రీనివాసాచార్యులు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖినదీ తీరాన కొలువైన లక్ష్మీనృసింహ స్వామి వారికి భక్తులు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ మేరకు స్వామివారిని ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు వివిధ రకాల పూలు, పత్రాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

అటవీ భూమిని పరిరక్షించండి



తహసీల్దార్ కార్యాలయం వద్ద గిరిజనుల నిరసన

గుమ్మలక్ష్మీపురం: ప్రభుత్వ అటవీ భూమి అన్యాక్రాంతం కాకుండా రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలని ఏపీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కోలక అవినాష్, జిల్లా ఉపాధ్యక్షుడు మండంగి రమణ డిమాండ్ చేశారు. ఎల్విన్‌పేట, జేకే పాడు, ఎస్‌కే పాడు గ్రామాలకు చెందిన గిరిజనులు గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో వీరు మద్దతుగా పాల్గొన్నారు. ఎల్విన్‌పేట పంచాయతీ పరిధిలోని భద్రగిరి గురుకుల బాలుర కళాశాల సమీపంలోని ప్రభుత్వ అటవీ భూములను 1995లో వన సంరక్షణ సమితిలో సభ్యులైన జేకే పాడు, ఎస్‌కే పాడు గ్రామాలకు చెందిన గిరిజనులకు ప్రభుత్వం అప్పగించిందన్నారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆ స్థలంలో ఇళ్ల స్థలాలు మంజూరు చేయిస్తామంటూ సీపీఐ నాయకులు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన గిరిజనులను రెచ్చగొట్టి ఆక్రమించుకునేలా ప్రయత్నాలు సాగిస్తున్నారని, ఆ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా అటవీ శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. లేని పక్షంలో రెవెన్యూ అధికారులు స్పందించి ఎల్విన్‌పేట పంచాయతీలోని నిరుపేద గిరిజనులకు ఆ స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందజేశారు.

సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన



రహదారి పనులకు శంకుస్థాపన చేస్తున్న వైస్‌చైర్మన్ తదితరులు

పాలకొండ: నగర పంచాయతీలోని నక్కలపేట నుంచి సాయినగర్‌కు వెళ్లే రహదారిలో సీసీ రోడ్డు వేసేందుకు రూ.7లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు గురువారం నగర పంచాయతీ వైస్‌చైర్మన్ రౌతు హనుమంతురావు ఆధ్వర్యంలో పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి స్థానికుల రహదారి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ల దృష్టికి తీసుకువెళ్లడంతో నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. వారం రోజుల్లో రహదారి పనులు పూర్తి చేస్తామని తెలిపారు.

తేజేశ్వరరావుకు సన్మానం



తేజేశ్వరరావును సన్మానిస్తున్న కౌన్సిలర్లు

పాలకొండ: వైద్య రంగంలో పరిశోధనా వ్యాసాలు రాసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో నిలిచిన పాలకొండకు చెందిన ఊణ్ణ తేజేశ్వరరావుకు గురువారం ఘన సన్మానం చేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు వెలమల మన్మధరావు ఆధ్వర్యంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు తేజేశ్వరరావుకు సన్మానించారు. గిన్నీస్ బుక్‌లో చోటు సంపాదించి పాలకొండ ప్రాంతానికి మంచి పేరు తీసుకువచ్చారని కొనియాడారు. తేజేశ్వరరావు తల్లితండ్రులు నర్సింగరావు, గౌరీలను సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు నాయకులు కడగల రమణ, కిల్లారి మోహన్, బాసూరు కాంతారావు, ఆకుల కుమార్, టేకి రామకృష్ణ, కోడెం విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సంతకాల సేకరణ



వారపు సంతలో సంతకాల సేకరిస్తున్న సీపీఎం నాయకులు

కురుపాం: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా మండల కేంద్రంలోని వారపు సంతలో సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు, మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సంతకాల సేకరణ గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాల వలన ధరలు విపరీతంగా పెరిగాయని, విద్యుత్ చార్జీలు ప్రతీ నెల పెంచుతున్నారన్నారు. ప్రతీ ఏడాది ఉద్యోగ నియామకాలు చేపడతామని తెలిపి నేటి వరకు ఆ ఊసే లేదన్నారు.

కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం వారపు సంతలో సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.సింహాచలం, గౌరీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ



విద్యార్థులకు నోట్‌బుక్స్‌ను అందజేస్తున్న ఎస్ సొసైటీ కార్యదర్శి, హెచ్‌ఎం

కురుపాం/జియ్యమ్మవలస: జియ్యమ్మవలస మండలంలోని తాళ్లడుమ్మ పంచాయతీ పరిధిలో రావాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన 28 మంది విద్యార్థులకు యూత్ ఎంపవర్‌మెంట్ సర్వీస్ సొసైటీ (యస్ సొసైటీ) ఆధ్వర్యంలో గురువారం నోట్‌బుక్స్‌ను యస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్ చేతుల మీదగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీ ద్వారా ప్రతీ విద్యార్థికి నోట్ బుక్స్‌ను పంపిణీ చేపడుతున్నామన్నారు. నిరుపేద విద్యార్థులు ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉల్లి అనూరాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వర్ణచిత్రం

రాఖీ పౌర్ణమి సందర్భంగా విశ్వవిజేత అలెగ్జాండర్‌కు రాఖీకట్టి తన భర్తను, రాజ్యాన్ని రక్షించుకున్న సాధ్విలలామ పురుషోత్తముని ఉత్తమ ఇల్లాలు వర్ణచిత్రం పలువురిని ఆకట్టుకుంది. మండలంలోని నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిసినాయుడు రాఖీపౌర్ణమి సందర్భంగా వేసిన ఈ చిత్రం పలువురిని ఆకర్షించింది.

– గరుగుబిల్లి

● రాఖీ అక్షరమాలలో ఆకర్షించిన చిన్నారులు



పాలకొండ: సోదరుడు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు రాఖీ కడుతున్న పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



గరుగుబిల్లి: జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయడుకు రాఖీ కడుతున్న రావివలస వైస్ సర్పంచ్ పద్మావతి



జియ్యమ్మవలస: పెదమేరంగి కూడలిలో రాఖీ అక్షరమాలలో ఆకర్షించిన తిరుమల సాయి విద్యార్థులు

అన్నాచెల్లెళ్ల అనురాగానికి, అనుబంధాలకు చిహ్నమైన రాఖీ పండుగను గురువారం వేడుకగా నిర్వహించారు. అక్కచెల్లెళ్లు అన్నదమ్ములకు రాఖీలు కట్టడం ద్వారా తమకు అండగా ఉండాలని మనసారా కోరుకుంటూ మిఠాయిలు తినిపించారు. జీవితాంతం అక్కచెల్లెమ్మలకు రక్షణగా ఉంటామని అన్నదమ్ములు కొండంత భరోసానిచ్చారు. మొత్తంగా రాఖీ పౌర్ణమి సందడిగా జరిగింది.

– సాక్షి నెట్‌వర్క్